క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం మంత్రి ధర్మానను ఎమ్మెల్యే రామిరెడ్డి సత్కరించారు.

వినతుల అందజేత

జలదంకి : ఆత్మకూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో మంత్రి ధర్మాన ప్రసాదరావుకు బ్రాహ్మణక్రాక వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం వినతిపత్రం అందించారు. బ్రాహ్మణక్రాకలో శ్మశాన స్థలం ఆక్రమణలో ఉందని, కాకమ్మ చెరువు కలుజు వాగు ఆక్రమణలో ఉందని, వాటిని సర్వే చేయించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో చేజర్ల హరిబాబురెడ్డి, పొజర్ల ఏసోబు, బంకా వెంకటరమణయ్య, ద్రోణాదులు కృష్ణారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



కావలి : పాతూరు పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కావలి వారికి హెచ్‌ఎం ఎస్.పద్మతులసీ ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు మధుసూదన్, ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలీ, రెడ్‌క్రాస్ సిబ్బంది పద్మావతి, శేషమ్మ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ఆరోగ్య సదస్సు



మాట్లాడుతున్న అతిథులు

కావలి : పట్టణంలోని రాజీవ్‌నగర్ సీహెచ్‌సీలో గురువారం ఆరోగ్య సదస్సు జరిగింది. డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మేఘనాథ్ చౌదరి మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్నామని, దీనిని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ఐరన్ పోలిక్, కాల్షియం, విటమిన్స్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ సునీత పాల్గొన్నారు.


పురోగతి లేకుంటే సహించేది లేదు



మాట్లాడుతున్న మెప్మా పీడీ రవీంద్ర

కావలి : జగనన్న కాలనీలు, ఏపీ టిడ్కో హౌసింగ్‌లకు సంబంధించి పురోగతి లేకుంటే సహించేది లేదని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.రవీంద్ర అన్నారు. కావలి పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న మెప్మా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్, ఏపీ టిడ్కో డీసీఓ, మెప్మా సిబ్బందితో గురువారం పీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ జగనన్న కాలనీలకు సంబంధించి లబ్ధిదారులు త్వరితగతిన ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి సీఎంఎం జె.భారతి, సీఓలు కొండయ్య, అరుణకుమారి, ఝాన్సీ లక్ష్మీ, సునీత పాల్గొన్నారు.

అప్పారావుపాళెంలో వైద్యశిబిరం



సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని అప్పారావుపాళెం పడమటి హరిజనవాడ ఎస్సీ కాలనీలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. 'అప్పారావుపాళెంలో ప్రబలిన జ్వరాలు' అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు కాలనీలో తాగునీటిని పరీక్షించారు. 20 మంది రక్తన మూనాలు సేకరించి సాధారణ జ్వరాలుగా నిర్ధారించారు. అవసరమైన మందులు పంపిణీ చేసి ఆరోగ్య జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులు, ఎంపీహెచ్‌ఓ నాగేంద్ర, ఏఎన్‌యం శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండాజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



ఉదయగిరి ప్రభుత్వ పాఠశాలలో చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్ర మింగిస్తున్న వైద్యాధికారిణి

దుత్తలూరు : ఆల్బెండాజోల్ మాత్రలతో శరీరంలో నులిపురుగులను నివారించవచ్చని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అయూబ్‌అప్సర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను ఆయన గురువారం మింగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆహారానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ సైమన్‌రావు, ఎంఈఓ వెంగయ్య, సీహెచ్‌ఓ ఓంకారయ్య, సూపర్‌వైజర్లు షేక్.ఖాజా మొహిద్దీన్, అరుణకుమారి, ఏఎస్‌ఎం మాధవి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ పాల్గొన్నారు.

93 శాతం పంపిణీ

వరికుంటపాడు : మండలంలో 93 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను మింగించామని వైద్యులు ఆయేషా, కరీష్మా తెలిపారు. వారు వేంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో జరుగుతున్న నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారిని 4,072 మందిని గుర్తించగా, 4,012 మందికి మాత్రలు మింగించి 93 శాతం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్లు అక్బర్‌బాషా, వెంకటయ్య, మేరీ పాల్గొన్నారు.

97 శాతం పూర్తి

ఉదయగిరి : మండలంలో 97 శాతం మందికి నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్లు మండల వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆమె గురువారం మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9,282 మంది విద్యార్థులకు గానూ 9,005 మందికి ఆల్బెండాజోల్ మాత్రలు మింగించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకేశవులు, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ చెన్నయ్య పాల్గొన్నారు.

➡ చేజర్ల : మండలంలోని చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులు, చిన్నారులకు నులిపురుగల నివారణ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. అదేలా చేజర్ల పీహెచ్‌సీ పరిధిలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు హర్షిత, నవీన్‌కుమార్‌రెడ్డి, జ్యోతి, సూపర్‌వైజర్ సుప్రజ, హెల్త్ అసిస్టెంట్ మస్తానయ్య పాల్గొన్నారు.

➡ అనంతసాగరం మండలంలోని స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ అనుమసముద్రంపేట : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను వైద్యులు మింగించారు. ఈ సందర్భంగా వైద్యరాలు మంజుల మాట్లాడుతూ 3,638 మందికి గానూ 3,530 మందికి మాత్రలు మింగించామని, అలాగే చిరమన పీహెచ్‌సీ పరిధిలో 1,847 మందికి గానూ 1,682 మందికి మాత్రలు మింగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

➡ సంగం: స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మందులను మంగళవారం మింగించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓలు జానకీరామ్, మల్లయ్య పాల్గొన్నారు.

➡ కలిగిరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను గురువారం మింగించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి బి.గీతారెడ్డి మాట్లాడుతూ మండలంలో 8,432 మందికి గానూ 8,112 మందికి డీవార్మింగ్ మాత్రలు మింగించినట్లు తెలిపారు.

➡ ఆత్మకూరు రూరల్ : మండలంలోని పలు పాఠశాలల్లో డీవార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు రాకేష్, అనూషకుమారి ఆధ్వర్యంలో 50 పాఠశాలల్లో 2,303 మంది చిన్నారులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,496 మందికి ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ కొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు) : మర్రిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వైద్యాధికారిణి కల్పన వైద్యసిబ్బందితో కలిసి విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



వరికుంటపాడు ఉన్నత పాఠశాలలో..



దుత్తలూరు : మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి అయూబ్‌అప్సర్



చేజర్ల మండలంలో..



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెంలో..





మర్రిపాడు కస్తూర్బాలో..



అనుమసముద్రంపేటలో..



ఆత్మకూరు రూరల్ : కరటంపాడులో..

అనంతసాగరంలో..

ఆహారోత్పత్తుల యూనిట్‌ను ఏర్పాటు చేయాలి

• ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు



ఫుడ్ ప్రాసెసింగ్ గురించి వివరిస్తున్న పీడీ శ్రీనివాసులు

ఆత్మకూరు : పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రోత్సాహకరంగా ఆహారోత్పత్తుల యూనిట్‌లను ఏర్పాటు చేయాలని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశ మందిరంలో పొదుపు సంఘాల సభ్యులతో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌ల తయారీపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌లపై ఆసక్తి కలిగిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ యూనిట్‌ల ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీ అందజేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు ఆహారోత్పత్తుల రంగంలోనూ ప్రావీణ్యం చూపాలన్నారు. మెప్మా సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి, డీఆర్పీ వెంకట్ పాల్గొన్నారు.

డీసీఎం వ్యాన్, లారీ ఢీ

• ఒకరికి గాయాలు

ఆత్మకూరు : పత్తిలోడుతో వస్తున్న డీసీఎం వ్యాన్‌ను ఐరెన్‌ఓర్ లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆత్మకూరు పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సైలు ముత్యాలరావు, సాయిప్రసాద్ వివరాల మేరకు.. ఓ వ్యాన్ బుచ్చిరెడ్డిపాళెంలో కొంత పత్తిని లోడ్ చేసుకొని వస్తూ వెంకట్రావుపల్లిలో మరికొంత పత్తిని లోడ్ చేసుకునేందుకు నెల్లూరు–ముంబై రహదారి నుంచి మలుపు తిరుగుతుండగా, అదే సమయంలో బద్వేల్ నుంచి కృష్ణపట్నానికి వెళ్తున్న ఐరెన్ ఓర్ లారీ వేగంగా ఢీకొంది. దీంతో డీసీఎం వ్యాన్‌లోని సుజిత్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంగం మండలం సిద్ధీపురం గ్రామానికి చెందిన సుజిత్‌కుమార్‌ను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఆనం అరుణమ్మ

బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జెడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థల సమస్య కారణంగా తుఫాన్ షెల్టర్‌లో తరగతులు నిర్వహిస్తుండటంపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పథకం కింద పాఠశాల ప్రగతికి విడుదలైన నిధులు, పనుల పురోగతిపై వివరాలు పరిశీలించారు. పది గదులతో పాఠశాల భవన నిర్మాణానికి రూ.1.2 కోట్ల నిధులు మంజూరు కాగా స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభించని విషయాన్ని ఉపాధ్యాయులు జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయాన్ని వెంటనే కలెక్టర్, కావలి ఎమ్మెల్యేతో మాట్లాడి స్థల సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొద్దిసేపు ముచ్చటించారు. విద్యార్థుల ఉత్తీర్ణత, అభ్యసన విధానాలు, పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించి చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం జువ్వలదిన్నెలోని అమరజీవి స్మారక భవనాన్ని సందర్శించి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించారు. అదే విధంగా సచివాలయంలో జరుగుతున్న 'నాభూమి–నాదేశం' కార్యక్రమంలో పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించారు.

పంచాయతీ ఉపఎన్నికలకు నామినేషన్ల పూర్తి



జలదంకి : ఎల్‌ఆర్ అగ్రహారం సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న కిరణ్



కలిగిరి: వీర్నకొల్లులో నామినేషన్ వేస్తున్న అనిత



ఆత్మకూరు : చెర్లోయడవల్లి సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న పద్మావతి

జలదంకి : జలదంకి మండలంలో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల ఉపఎన్నికలకు సంబంధించి గురువారం సాయంత్రం 5 గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌బాబు తెలిపారు. ఎల్‌ఆర్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ స్థానానికి మొత్తం ఎనిమిది నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరఫున మేకా కిరణ్, పరుసు వెంకమ్మ నామినేషన్లు వేశారు. టీడీపీ తరఫున మంగల శ్రీనివాసులు నామినేషన్ వేశారు. వేములపాడు పంచాయతీలో రెండు వార్డులకు నలుగురు, కమ్మవారిపాళెం పంచాయతీలో ఒక వార్డుకు ఒకరు, చినక్రాక పంచాయతీలో ఒక వార్డుకు ఒకరు, సోమవరప్పాడు పంచాయతీలో ఒక వార్డుకు ఇద్దరు నామినేషన్లు వేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎస్సై ఆదిలక్ష్మి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాలుగు వార్డులకు 4 నామినేషన్లు

అనుమసముద్రంపేట : పంచాయతీ ఉపఎన్నికలకు సంబంధించి మండలంలోని వేల్పుగుంటలో రెండు వార్డులు, జమ్మవరంలో 1, చిరమనలో 1 ఖాళీగా ఉన్నాయని ఎంపీడీఓ భాస్కర్ గురువారం తెలిపారు. ఈ ఖాళీలకు నాలుగు నామినేషన్లు మాత్రమే వచ్చినట్లు తెలియజేశారు.

మూడు వార్డులకు 4 నామినేషన్లు

చేజర్ల : మండలంలోని కోటితీర్థం, మాముడూరు, పాతపాడు పరిధిలో మూడు వార్డులు ఖాళీగా ఉన్నాయని, వాటికి నాలుగు నామినేషన్లు వచ్చినట్లు మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత గురువారం తెలిపారు. కోటితీర్థంలో ఎనిమిదో వార్డుకు ఒకటి, మాముడూరు ఒకటో వార్డుకు ఒకటి, పాతపాడు ఐదో వార్డుకు రెండు నామినేషన్లు వచ్చినట్లు తెలియజేశారు.

అనంతసాగరంలో..

అనంతసాగరం మండలంలోని మినగల్లు పంచాయతీ 8వ వార్డుకు సంబంధించి ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎంపీడీఓ మధుసూదనరావు తెలిపారు.

రెండు వార్డులకు ఒక్కో నామినేషన్

కలిగిరి : మండలంలో వెలగపాడు పంచాయతీలో ఐదో వార్డు, వీర్నకొల్లు పంచాయతీలో మూడో వార్డుకు సంబంధించి ఒక్కో నామినేషన్ దాఖలయ్యాయని ఎంపీడీఓ ఆర్వీ కళాధర్‌రావు తెలిపారు. వీర్నకొల్లు పంచాయతీకి నలగర్ల అనిత, వెలగపాడు పంచాయతీకి పువ్వాడి శేషమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.

చెర్లోయడవల్లి సర్పంచ్‌కు ఒకే నామినేషన్

ఆత్మకూరు : మండలంలోని చెర్లోయడవల్లి సర్పంచ్ స్థానానికి గురువారం ఒక నామినేషన్ దాఖలైంది. గ్రామానికి చెందిన పేరెడ్డి పద్మావతి మాత్రమే నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సోమవరపు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత సిద్ధం పెంచలనరసయ్య పాల్గొన్నారు. అలాగే మహిమలూరు పంచాయతీ ఏడో వార్డుకు మూరం రెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు.

➡ మర్రిపాడు మండలంలోని పడమటినాయుడుపల్లి పంచాయతీ మూడో వార్డుకు పడసాల వినోద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. అలాగే పొంగూరుకండ్రిక ఒకటో వార్డుకు కె.వెంగమ్మ, కె.వెంకమ్మ నామినేషన్లు దాఖలు చేశారు.

త్యాగమూర్తులను స్మరించుకుందాం



అల్లూరు : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



ఉదయగిరి : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆత్మకూరు : వెన్నవాడలో విద్యార్థుల ర్యాలీ

అల్లూరు : భారతదేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. స్థానిక రామకృష్ణా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశానికి మంచి పేరు తీసుకొచ్చేలా జీవించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరిప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఇన్‌చార్జి జె.జయప్రకాష్, పి.మల్లికార్జునరెడ్డి, ఏఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

➡ ఉదయగిరి : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి– నా దేశం' కార్యక్రమాన్ని ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శిలాఫలకం ఆవిష్కరణ, అమరవీరుల చిత్రపటాలకు నివాళులు, మొక్కలు నాటడం, ప్రతిజ్ఞ, ర్యాలీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, సర్పంచ్ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాని, ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు, ఎఫ్‌ఎస్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

➡ ఆత్మకూరు : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని వెన్నవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ వీధుల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం సచివాలయంలో మొక్కలు నాటారు. అంతకుముందు పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎఫ్‌ఏ–1 పరీక్ష పత్రాలను ఉపాధ్యాయుడు రవీంద్రకుమార్ తల్లిదండ్రులకు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సర్వేయర్ సురేంద్రను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఏఎస్‌పేట మండలం రాజవోలుకు చెందిన గొల్లప్రోలు శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆత్మకూరులోని అభిరామ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండడంతో ఆయన్ను పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న సురేంద్ర నెల్లూరుపాళెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయన్ను పరామర్శించారు. జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, రూరల్ జేసీఎస్ కన్వీనర్ వి.రాజేంద్రనాయుడు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

కలిగిరి : మండల పరిధిలోని కృష్ణారెడ్డిపాళెంలో ఉన్న జగనన్న కాలనీలో 14 ఇళ్ల నిర్మాణాలకు సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి డివిజన్ హౌసింగ్ ఈఈ వంగవరపు ప్రసాద్, ఏఈ వెంకటేశ్వర్లురెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వి.వెంకటేశ్వర్లురెడ్డి, సి.మనోహర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిత్ర పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



అనుమసముద్రంపేట : మాట్లాడుతున్న మారుతీదేవి



ఆత్మకూరు రూరల్ : మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

అనుమసముద్రంపేట : చిరుధాన్యాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నెల్లూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మారుతీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఆత్మ ప్రాజెక్ట్ సౌజన్యంతో రైతులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఇనుము, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయని, అవి మన ఆరోగ్యానికి ప్రయోజనకరమని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయకుమార్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి శైలజాకుమారి, ఏఓ రజని పాల్గొన్నారు.

➡ ఆత్మకూరు రూరల్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సభ్యులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్, ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఇఫ్కో సేల్స్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఓ కిశోర్, ఏఈఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినం



ఆత్మకూరు : యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని వారి కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ సీనియర్ నేత వేము పెంచలయ్య చేతుల మీదుగా పతాకావిష్కరణ చేశారు. అనంతరం పతాక గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శివప్రసాద్‌రావు, ఆత్మకూరు నేతలు ఎం.గంగాధర్, ప్రసాద్, హరికృష్ణ పాల్గొన్నారు.

15 నుంచి గంధ మహోత్సవం

ఉదయగిరి : పట్టణంలోని హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాన్‌సాహెబ్ ఖాదిరి ఔలియా 218వ గంధమహోత్సవం ఈనెల 15న జరుగనుంది. ఈ తరుణంలో కావ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) గురువారం కావలిలోని తన కార్యాలయంలో గంధమహోత్సవ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం గంధమహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోజ్‌దార్ మన్సూర్, ఖాదర్‌బాషా, సికిందర్ పాల్గొన్నారు.